క్లుప్తంగా

వసతి గృహాల తనిఖీ



వార్డెన్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ

దొనకొండ: స్థానిక ఎస్సీ-1, ఎస్సీ-2, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను ఎంపీడీఓ ఎం.శ్రీదేవి గురువారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు వసతి గృహాలను తనిఖీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. వసతి గృహాల్లో పారిశుధ్యం, విద్యార్థులకు సరిపడా గదులు, కిచెన్, బాత్రూమ్‌లు తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా తదితర విషయాలను వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సమస్యలు ఏవైనా ఉంటే తమకు తెలియజేయాలని వార్డెన్‌లకు సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఎస్.డేవిడ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 80 మందికి పరీక్షలు



వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన గుండె, కంటి వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నంద్యాల జిల్లాకు చెందిన శాంతీరామ్ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పటల్‌కు చెందిన వైద్యులు తెలిపారు. వైద్య శిబిరంలో 80 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వీరిలో 10 మందికి శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని సూచించినట్లు చెప్పారు. వైద్య శిబిరంలో వైద్యులు దివాకర్, ఆది, ప్రసాద్, మూర్తి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంఈఓ-2

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం, తెల్లబాడు గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా గురువారం తనిఖీ చేశారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కుకింగ్ నిర్వాహకులకు సూచన, సలహాలందించారు. విద్యార్థులను భోజనం ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, ఏమైనా లోపాలు ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. వారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవోలు

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిర అన్నారు. గురువారం మండలంలోని సిద్దనపాలెం, ఐటీవరం, మానేపల్లి, రెంటపల్లి పాఠశాలలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెసన్ ప్లాన్స్ రాయాలన్నారు. అదే విధంగా విద్యార్థుల నోట్‌పుస్తకాలు కూడా కరెక్షన్ చేయాలన్నారు. రోజూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను, ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. అడుగుకో గుంత..గజానికో గొయ్యి ఏర్పడి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులైనా చేయాలన్న ఆలోచన కూడా సంబంధిత అధికారులు చేయడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 100 రోజుల పాలన అద్భుతమని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం పాలనను గాలికొదిలేసింది. ఆ పార్టీ నేతలు నాలుగు రాళ్లు వెనకేసుకునే ప్రయత్నంలో ఉన్నారని సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చట్లమిట్ల వద్ద తారు రోడ్డుపై గుంతలు

- వర్షాలకు మరింతగా దెబ్బతిన్న రోడ్లు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

పెద్దారవీడు:

కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల రోడ్లు ఛిద్రమయ్యాయి. మండల పరిధిలోని బద్వీడుచెర్లోపల్లి, బద్వీడు, ప్రగళ్లపాడు, ఏనుగులదిన్నెపాడు, చట్లమిట్ల గ్రామాల మధ్య రోడ్లు గుంతలమయంగా మారాయి. సంబంధిత అధికారులు తారు రోడ్డుపై గుంతలు పడినచోట తాత్కాలికంగా గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలనే ఆలోచన కూడా చేయడం లేదు. రహదారిలో నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనలపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పలు గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడిక్కడే నిలిచిపోవడంతో గుంతలుగా ఏర్పడ్డాయి. రాకపోకలతో రోడ్డుపై తారు, కంకర లేచి గుంతలుగా మారాయి. తారు రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో మూసుకుని ఉంది. దీంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. రహదారులు శిథిలావస్థకు చేరుకొని ఆధ్వానంగా మారడంతో ప్రయాణం చేయాలంటే నరకాన్ని తలపిస్తోంది. రాత్రిపూట రహదారి గురించి తెలియని దూర ప్రాంతాల ప్రజలు వేగంగా వాహనాలతో వస్తే గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గుంతలు పడిన చోట తాత్కాలికంగా మట్టి, కంకర వేసి మరమ్మతులు చేయాలనే విషయాన్ని అధికారులు మరచిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 100 రోజుల పాలనలో అభివృద్ధి చేశామని చెపుతున్నారేగానీ కళ్లముందు కనిపిస్తున్న రహదారుల దుస్థితి కనిపించటం లేదని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి నాయకులు స్పందించి తారు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రయాణం సాఫీగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బద్వీడుచెర్లోపల్లి వద్ద రోడ్డుకు ఇరువైపులా చిల్లకంప

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రతమత్తంగా ఉండాలని ఎస్ఐ సంపత్‌కుమార్ కోరారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు కూడా అవగాహన పెంచాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు రావడం, లాటరీ తగిలిందని చెప్పడం, బహుమతి వచ్చిందని, అకౌంట్ నంబర్ చెప్పండని, లింక్ ఓపెన్ చేయండి.. మీరు లక్షాధికారులవుతారని మెసేజ్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. అంతేగానీ వాటిని ఓపెన్ చేస్తే మోసపోతారని హెచ్చరించారు. మీ కుటుంబ సభ్యులకు ఈ విషయాలు తెలియజేస్తే ఎంతో మంచి జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్ వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి



గ్రామసభలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కిరణ్

పుల్లలచెరువు: రీ సర్వేలో భాగంగా వచ్చిన భూ సమస్యలను పరిష్కరించుకునేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ తెలిపారు. గురువారం మండలంలోని చౌటపల్లి సచివాలయం పరిధిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ రైతులతో మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని తెలిపారు. సమస్యలున్న రైతులంతా అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు కె.రఘు మాట్లాడుతూ చౌటపల్లి ఇలాకాలో ఎప్పుడో 1956లో రీసర్వే నిర్వహించి ఈనాం భూములను తొలగించి రైతు వారీ పట్టాలు ఇస్తే ఇప్పుడు రీ సర్వేలో ఈనాం పట్టాగా నమోదు కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు ఎటువంటి క్రయ, విక్రయాలు నిర్వహించుకోలేక పోతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వీఆర్వోలు కోటేశ్వరరావు, బాషా, సర్వేయర్లు రాజ్‌కుమార్, నాయక్, రైతులు పాల్గొన్నారు.

దొనకొండ: రైతుల నుంచి భూ సమస్యలపై 30 అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. గురువారం మండలంలోని లక్ష్మీపురంలో భూముల రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల సమస్యలపై వచ్చిన అర్జీలను వీఆర్‌ఓలతో పరిశీలించి సరైన ఆధారాలు ఉంటే రైతులకు న్యాయం చేస్తామన్నారు. రైతులు ఎప్పుడైనా సమస్యలుంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయం సంప్రదించాలన్నారు. భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో ఎక్కువ భాగం జాయింట్ పట్టాలు ఉన్నాయని, ప్రత్యేకంగా ముగ్గురు సర్వేయర్లను గ్రామంలో నియమించామని, వారు అర్జీదారులతో మాట్లాడి జాయింట్ పట్టాల అర్హతను చూసి వారికి తగు న్యాయం చేస్తామన్నారు. భర్త మృతి చెందితే పొలం భార్యకు వచ్చేలా భార్యభర్తలిద్దరూ లేకుంటే వారి సంతానానికి సంక్రమించేలా హక్కు కల్పిస్తామన్నారు. గ్రామంలో ఎక్కువ భాగం ఆన్‌లైన్ పాస్ పుస్తకాల సమస్య ఉందని, వారు వెంటనే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే ఆన్‌లైన్ చేస్తామని, దాని వలన రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నాగార్జున రెడ్డి, సర్వేయర్లు మస్తాన్, వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాస్తవాలు మాట్లాడితే వ్యక్తిగత దూషణలా?

- టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ నాయకుల ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యర్రగొండపాలెం: వాస్తవాలు మాట్లాడుతుంటే వ్యక్తిగత దూషణలకు దిగి అవాస్తవాలు సృష్టిస్తున్నారని, గౌరవ వ్యక్తులపై అభాండాలు వేసి అగౌరవ పరుస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు హితవు పలికారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్ మాట్లాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఎన్నికలకు 5 నెలల ముందు వచ్చారని, ఆయన నియోజకవర్గంలో ఉన్న నాయకులు, కార్యకర్తలను స్వల్ప కాలంలో సమన్వయం పరుచుకోవడం వల్లే ఎన్నికల్లో గెలిచారని పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి..అని చెప్పుకుంటూ తిరుగుతున్న గూడూరి ఎరిక్షన్ బాబు 3 ఏళ్ల క్రితం వచ్చినప్పటికీ తమ పార్టీలో ఎటువంటి పురోగతిలేకున్నా వర్గాలకు ఆజ్యం పోసుకోవడం వల్లే ఆయన ఓడిపోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. చింత సచ్చినా పులుపు చావలేదన్నట్లు ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజల చేతుల్లో ఓడిపోయినా అధికారం ఉందని తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, తన అనుచరులు రేషన్ మాఫియాగా మారి పేదల బియ్యాన్ని మింగేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. జగనన్న పాలనలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిగా వలంటీర్లే చూసేవారని, ఇప్పుడు తమ సొంత జేబు నుంచి డబ్బులు ఇస్తున్నట్లు టీడీపీ నాయకులు ప్రతినెలా 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్..అంటూ ప్రచారం చేసుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలకు మొండిచేయి చూపారని, ముందుగా వాటి పరిస్థితి ఏమిటో తేల్చుకొని ప్రజల ముందుకు రావాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులపై అనవసరపు అభాండాలు వేస్తున్నారని, వాటిని రుజువు చేయిస్తే తాము ఏ శిక్షకైనా సిద్ధమేనన్నారు. గ్రామాల్లో ప్రజలు నీటి కోసం అలమటించకుండా ఆదుకున్న వారికి బిల్లులు మంజూరు కాకుండా చేశారని, నీటి ట్యాంకర్లో పురుగుల మందు కలిపిన ఘనత టీడీపీ నాయకులకే దక్కుతోందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎనలేని కృషి చేశారని, అందులో భాగంగా పుల్లలచెరువు మండలం రంగన్నపాలేనికి సమీపంలో రైతుల భూముల్లో వారి అనుమతితోనే 220/132/32కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు చేశారని, మంజూరైన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములకు నష్టపరిహారం కింద నిబంధనల మేరకు రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేశారని, రైతులకు ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించారని గగ్గోలు పెట్టడం ఎంతవరకు సమంజసమని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నించారు. విద్యుత్ సబ్ స్టేషన్ పనులు ప్రారంభించక ముందే అక్కడ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసుకున్నట్లు, యర్రగొండపాలెంలో వెంచర్ వేసిన స్థలం శ్మశానవాటికదని అడ్డగోలుగా ఆరోపిస్తున్నారని, ఆరోపణలను రుజువు చేయాలని, అందుకు తాము ఏ శిక్షకైనా సిద్ధమేనని వైఎస్సార్ సీపీ నాయకులు సవాల్ విసిరారు. సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల కన్వీనర్లు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, పి.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, జి.రమణారెడ్డి, సచివాలయాల మండల కనీ్వనర్ సయ్యద్ జబీవుల్లా, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, వివిధ విభాగాల నాయకులు, సర్పంచ్‌లు ఉమామహేశ్వరరెడ్డి, చంద్రకాంత్ నాయక్, జి.ఎల్లేష్ యాదవ్, ఏకుల ముసలారెడ్డి, డి.సుబ్బారెడ్డి, టి.సత్యనారాయణ, ఎ.కోటిరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, ఎ.రమణారెడ్డి పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించాలి



పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న పశువైద్య సిబ్బంది

పుల్లలచెరువు: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించాలని మండల పశువైద్యాధికారి నాగుల్‌మీరా అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన పశుపోషకులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల్లో ఏలిక పాములు, బద్దె పురుగు, లివర్‌ఫ్లూక్ మొదలగు అంతర్ పరాన్న జీవులతో అనేక అనర్థాలు సంభవించడంతో గొర్రెలు, మేకల పెంపకందారులు 30 శాతం ఆదాయాన్ని కోల్పోతున్నారన్నారు. నట్టల నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న మందును గొర్రెలు, మేకలకు తాపించి పశుపోషకులు లబ్ధి పొందాలని సూచించారు. ఎంపీటీసీ రాధాకృష్ణ, వీఏ హేమసింధు, రైతులు పాల్గొన్నారు.

సమాజంలో మంచిగా జీవించాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: సమాజంలో మంచిగా బతికి పేరు తెచ్చుకోవాలని ఎస్ఐ సంపత్‌కుమార్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్స్‌కు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీయిజం చేస్తే నష్టం జరుగుతుందని, దీంతో కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలిగానీ నేరాలమయం కాకూడదని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా చిన్న గొడవ చేసినా, రౌడీయిజం చేసినా కేసు నమోదు చేసి జైలు పంపుతామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మంచిగా, బుద్ధిగా మసులుకుంటే అధికారులు తగు మేలు చేస్తారని చెప్పారు. గ్రామాలు ప్రశాంతతకు మారు పేరుగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను మార్కాపురం డీఎస్పీ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

భవిత కేంద్రం ఆకస్మిక తనిఖీ



భవిత కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రమాదేవి

దర్శి: స్థానిక భవిత కేంద్రాన్ని ఎంఈఓ రమాదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ క్యాంప్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దివ్యాంగులను సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్టు అంకారావు చేస్తున్న భౌతిక చికిత్స పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పూర్తి అయిన వెంటనే ఇంటి వద్ద కూడా విద్యార్థులకు ఫిజియోథెరపీపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ ఉపాధ్యాయులు గోపాలుని సుబ్రహ్మణ్యం, మందపల్లి శ్రీనివాసులు, లీలావతి పాల్గొన్నారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి



పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ మాధవరావు

పెద్దారవీడు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవంగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు అన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారి గొబ్బూరు గ్రామం వద్ద గురువారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, ఎక్కువ మందిని ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు.

కేజీబీవీకి వసతులు కల్పిస్తాం



కేజీబీవీ పాఠశాలలో వసతులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ముండ్లమూరు (దర్శి): కేజీబీవీ పాఠశాలలకు వసతులు కల్పిస్తామని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ అన్నారు. మండలంలోని ముండ్లమూరు, మారెళ్ల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో అదనపు తరగతి గదులు, అదనపు మరుగుదొడ్ల నూతన నిర్మాణాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు ఫ్యాన్‌లు, కిటికీలు, టాయిలెట్‌లు వంటి సౌకర్యాలు కల్పించాలని గుర్తించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ బలి



చౌడమ్మ మృతదేహం

ముండ్లమూరు (దర్శి): పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటుకు గురై దుళ్ల చౌడమ్మ (55) మృతి చెందింది. ఈ సంఘటన కమ్మవారిపాలెంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. చౌడమ్మ గడ్డి కోస్తుండగా పాము కరిచింది. దీంతో కళ్లు తిరిగి పడిపోయిన చౌడమ్మను వినుకొండ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. చౌడమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కును పోగొట్టుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు గణపవరం విద్యార్థులు



ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: బాలికల ఖోఖో పోటీల్లో గణపవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 14 ఏళ్ల బాలిక ఖోఖో విభాగంలో పి.స్వాతి, ఎన్. వైష్ణవి, 17 ఏళ్ల విభాగంలో కృష్ణ సరిత, వెంకట రజితలు జిల్లా స్థాయిలో పంగలూరులో జరిగిన పోటీల్లో ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో నవంబర్ 2,3,4వ తేదీల్లో జరిగే పోటీల్లో వీరు జిల్లా ఖోఖో జట్టు తరపున ఆడనున్నారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు, పీడీ దొండపాటి బాలరాజు, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.గాలిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.